క్లుప్తంగా

ముస్లింల ప్రాతినిధ్యం కోరుతూ పోస్ట్‌కార్డు ఉద్యమం



పోస్ట్‌కార్డు ఉద్యమంలో పాల్గొన్న ముస్లింలు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర నుంచి ముస్లింల ప్రాతినిధ్యం కోరుతూ పోస్ట్‌కార్డు ఉద్యమం కొనసాగుతోంది. 68లో కనీసం ఒక్కటి అనే నినాదంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర ముస్లిం ఫోరమ్ నాయకులు చేపట్టిన ఉద్యమంలో భాగంగా శుక్రవారం పాతనగరం కోటవీధిలో గల అంబుసరంగ్ వీధిలో గల మసీదు, రిజర్వ్‌లైన్ మసీదులో పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో గల 68 నియోజకవర్గాల్లో కనీసం ఒక్క సీటైన ముస్లింలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోస్ట్‌కార్డు ఉద్యమం ద్వారా వచ్చిన పోస్ట్‌కార్డులను ఉత్తరాంధ్ర ముస్లిం ఫోరమ్ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఫోరమ్ ప్రతినిధులు చిట్టిబాబు, ఖాజా రహ్మతుల్లా, అఫ్సర్‌ఖాన్, బొకారి, ఉస్మాన్, మోతీ, మతపెద్దలు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

జగదాంబ: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలిసి ఆవిష్కరించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు నగరం నలువైపుల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారి పూజల్లో పాల్గొని తరించాలన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం షామియానాలు ఏర్పాటు చేసి, తాగునీరు, ప్రసాదాలు అందజేయాలని ఆలయ కమిటీ చైర్మన్ మల్లిబాబుకు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డల పరిశుభ్రతకు ప్రాధాన్యం



బీచ్‌రోడ్డు వద్ద కాలువలో పూడిక తీయిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: రానున్న వర్షాకాలం నేపథ్యంలో గెడ్డలు, కాలువలను పరిశుభ్రం చేయిస్తున్నట్లు జీవీఎంసీ జోన్‌-4 కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన జోన్ పరిధి బీచ్ రోడ్డులో కాలువ పూడిక పనులు చేయించారు. కమిషనర్ రాజాబాబు ఆదేశాల మేరకు గెడ్డ లు, కాలువలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు పొంగి మురుగునీరు, చెత్త రహదారులపై ప్రవహించకుండా ముందుగా పరిశుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. బీచ్‌రోడ్డులో చాలా కాలంగా మట్టితో కూరుకుపోయిన కాలువలను రెండురోజులుగా శుభ్రం చేశామన్నారు. అలాగే జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్ వద్ద కెనాల్, కేజీహెచ్ నుంచి పూర్ణామార్కెట్ మీదుగా వెళ్లే ప్రధాన మురుగు కాలువలు లక్ష్యంగా పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.

తీరంలో చెత్త తొలగింపు

బీచ్‌రోడ్డు : తీరంలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ సిబ్బంది సేకరించి తరలిస్తున్నారు. జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో తీరంలో ఉన్న చెత్తను శుభ్రం చేసి తీరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. కొబ్బరి చెట్ల వద్ద పడిపోయిన కొబ్బరి మట్టలు, ప్లాస్టిక్ వస్తువులను తరలిస్తున్నారు. మరో వైపు బీచ్‌రోడ్డు మొత్తం పచ్చదనంతో నింపేందుకు మొక్కలను నాటుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ మెరుగుపడేదెప్పుడో..

- నగరంలో పలు ప్రాంతాల్లో పని చేయని సిగ్నలింగ్ వ్యవస్థ
- జి-20 సదస్సు నేపథ్యంలో అయినా మెరుగుపడేనా..



లీలామహల్ జంక్షన్ వద్ద వెలగని సిగ్నల్ లైట్లు



సిగ్నల్ లైట్లు వెలగకపోవడంతో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనచోదకులు



రామకృష్ణా జంక్షన్ వద్ద..



ఎల్ఐసీ అంబేద్కర్ కూడలిలో..

డాబాగార్డెన్స్: నగరం అభివృద్ధి చెందుతోంది. జనాభా పెరుగుతున్నారు. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. ట్రాఫిక్‌కు తగ్గట్టు ఐల్యాండ్లు ఉన్నాయి. వాటి పనితీరు మాత్రం పోలీస్ ఉన్నతాధికారులు గాలికొదిలేసారు. ఫలితంగా ట్రాఫిక్ ఐల్యాండ్లు.. అక్కడ ఏర్పాటు చేసిన సిగ్నల్స్ నిరుపయోగంగా పడి ఉన్నాయి.

పని చేయని సిగ్నల్స్..

డాబాగార్డెన్స్ అంబేద్కర్ కూడలి, మహిళా పోలీస్ స్టేషన్, సౌత్‌జైల్‌రోడ్డు, లీలామహల్ జంక్షన్, రామకృష్ణా జంక్షన్ ఇలా నియోజకవర్గ పరిధిలోని పలు జంక్షన్లు, ఐల్యాండ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే వాటి పనితీరుపై పోలీసులు సరిగ్గా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేసులపై ఉన్న శ్రద్ధ.. సిగ్నల్ లైట్లపై లేదు

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు.. ఆదేశాల మేరకు పోలీసులు ద్విచక్రవాహన చోదకులపై విరుచుకుపడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారికి హెల్మెట్ తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వాహనచోదకులు హెల్మెట్‌ను 90 శాతం పైబడే వినియోగిస్తున్నారు. అయితే కొంత మంది వాహనచోదకులు పొరపాటున హెల్మెట్ మరచిపోయి డ్రైవింగ్ చేస్తే.. సిటీ పరిధిలో ఎక్కడికక్కడ పోలీసులు కాపు కాసి మరీ కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్యూటీకి వెళ్లే సమయంలో గాబరాగా వెళ్తున్నామని ప్రాధేయపడినా పోలీసులు క్షమించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


ట్రాఫిక్ సిబ్బంది లేకపోతే ఇక్కట్లే..

నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు చాలా ప్రాంతాల్లో పని చేయడం లేదు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బంది లేకపోతే సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ తీవ్రస్థాయిలో నిలిచిపోతుంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలంటే కనీసం నాలుగు దిక్కులా నలుగురైదుగురు ట్రాఫిక్ సిబ్బంది ఉండాల్సిందే.. సిగ్నల్ లైట్లు పనిచేసి ఉంటే సిబ్బంది కొరత ఉండదు కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జి-20 సదస్సు సందర్భంగానైనా..

ఇదిలా ఉండగా విశాఖలో మార్చి నెలలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. సదస్సుల నేపథ్యంలో నగర సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే వాటితో పాటు ట్రాఫిక్ ఐల్యాండ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్‌కు కూడా మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి బోర్లు ప్రారంభం



కొబ్బరితోటలో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ప్రారంభిస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట, మురళీధర వీధుల్లో ఇటీవల జీవీఎంసీ నిధులతో వేసిన బోర్లను వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారంతో వార్డులో సీసీ రోడ్లు, కాలువల మరమ్మతులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని వార్డు ప్రజలను నీటి ఎద్దడి నుంచి విముక్తి కలిగించేందుకు వార్డులో రెండు కొత్త బోర్లు వేసి ప్రారంభించినట్లు తెలిపారు. వార్డులో పాడైన బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి లండా రమణ, టర్నర్ చౌల్ట్రీ మాజీ చైర్మన్ లింగం శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు పిల్లి సత్తిబాబు, కడవల నాగమణి, అంబటి అప్పలరాజు, దూడ అప్పారావు, అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల పలు వార్డులకు సంబంధించి ఆయా వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, వలంటీర్లతో పాటు ఇటీవల నియమితులైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం సమావేశం కానున్నారు. జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ రామాలయ కల్యాణ మండపంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 36, 38, 39 వార్డులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 28, 29, 30, 37 వార్డులకు సంబంధించి మీటింగ్ నిర్వహించి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ ఇవ్వనున్నారు.

బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య రఘురామారావు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం పూర్వ విద్యార్థి, ఐఐటి చెన్నై పూర్వ ఆచార్యులు సి.కాళిదాస్ రచించిన బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ఆచార్యులు జి.రఘురామారావు ఆవిష్కరించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాశ్చాత్య దేశంలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన బయోఫిజికల్ కెమిస్ట్రీపై భారత దేశంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఆచార్య కాళిదాసు ఈ పుస్తకాన్ని రచించా రు. ఆవిష్కరణలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సి పాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



ఎబిలిటీ చిల్డ్రన్ పార్క్‌లో ఆడుకుంటున్న చిన్నారులు

బీచ్‌రోడ్డు : తీరంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ ఎబిలిటీ పార్క్‌లో చిన్నారులు శుక్రవారం తమ ఆట పాటలతో సందడి చేశారు. పార్క్‌లోని జారుడుబల్ల, జంపింగ్ తదితర ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేశారు. కొన్నాళ్లుగా ఈ పార్క్‌ను మరమ్మతుల కోసం మూసేశారు. చాలా రోజుల తరువాత తిరిగి ప్రారంభించ టంతో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు.

విశ్వహిందీ సమ్మేళనానికి ఆచార్య ఇక్బాల్



ఆచార్య ఇక్బాల్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎస్.ఎం.ఇక్బాల్‌కు అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 15 నుంచి 17 వరకు ఫిజీ దేశంలో భారత ప్రభుత్వం నిర్వహించే 12వ విశ్వ హిందీ సమ్మేళనంలో ఆచార్య ఇక్బాల్ పాల్గొననున్నారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారు. ఈ సదస్సులో ఆచార్య ఇక్బాల్ 'రాజభాష హిందీని రాష్ట్ర భాష హిందీ అనడం ఎందుకు అవసరం'అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. ఏయూ హిందీ విభాగంలో ఆచార్య ఇక్బాల్ 37 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ పొందారు. సమ్మేళనానికి హాజరుకానున్న సందర్భంగా ఆచార్య ఇక్బాల్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కిషోర్‌బాబు పాల్గొన్నారు.

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి



చేనేత చీరను పరిశీలిస్తున్న జయేష్‌కుమార్ తదితరులు

బీచ్‌రోడ్డు: చేనేత హస్తకళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రామీణ హస్తకళల సంస్థ కార్యదర్శి జయేష్ కుమార్ గుప్తా అన్నారు. బీచ్ రోడ్డులోని నోవాటెల్‌లో గ్రామీణ హస్తకళల సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ గ్రామాల్లో లభ్యమయ్యే హస్తకళా ఖండాలను ఈ ఎక్స్‌పో ద్వారా విశాఖ వాసులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 50కి పైగా స్టాల్స్‌తో ఈ ఎక్స్‌పో 14వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

15న తెలుగు విభాగం ఫ్రెషర్స్ డే



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థులు ఈ నెల 15న ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు శుక్రవారం తెలిపారు. ఫ్రెషర్స్ డే ద్వారా విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. నూతన విద్యార్థుల్లో ఉన్న భయాలను తొలగిస్తూ వారిలో శారీరక, మానసిక ఉల్లాసానికి తోడ్పడేలా ఆటపాటల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

ప్రభుత్వ భూములపై సీపీఎం పాదయాత్ర

ఆరిలోవ : ముడసర్లోవ భూములను ప్రైవేట్‌పరం చేయొద్దంటూ సీపీఎం నాయకులు శుక్రవారం పదో వార్డులో పాదయాత్ర నిర్వహించారు. ముడసర్లోవ ప్రాంతంలో ప్రభుత్వానికి చెందిన 283 ఎకరాల భూములు పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకులు ఆరిలోవ ప్రాంతంలో మూడు రోజులుగా పాదయాత్ర చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పదో వార్డు పరిధి రవీంద్రనగర్ నుంచి ఆదర్శనగర్ మీదుగా డెయిరీఫారం వరకు పాదయాత్ర నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యాతరంగిణి చీఫ్ వార్డెన్‌గా వినుత



విద్యా తరంగిణి చీఫ్ వార్డెన్‌గా ఉత్తర్వులు స్వీకరిస్తున్న డాక్టర్ వినుత

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వారి వసతి కోసం విద్యాభవన్‌ని విద్యార్థినుల హాస్టల్‌గా తీర్చిదిద్ది విద్యాతరంగిణిగా మార్పు చేశారు. ఈ హాస్టల్ ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్‌గా ఏయూ అప్లయిడ్ మేథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినుత నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్‌కిషోర్ బాబు నుంచి ఆమె ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ వినుతను ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఏ.కె.ఎం.పవార్ తదితరులు అభినందించారు.

నగర సుందరీకరణకు కృషి చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



బీచ్‌రోడ్డు ఫుట్‌పాత్ వర్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు తదితరులు

డాబాగార్డెన్స్: నగరంలో మార్చిలో రెండు అంతర్జాతీయ సదస్సులు జరగనున్నందున దేశ, విదేశాల నుంచి అతిథులు రానున్న దృష్ట్యా వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్-3 పరిధి సిరిపురం జంక్షన్ నుంచి ఆర్కే బీచ్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌రోడ్డులో ఉన్న ప్రజా మరుగుదొడ్లను మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, నగర సుందరీకరణ, ఇంజనీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా సిరిపురం జంక్షన్ నుంచి వైఎంసీఏ వరకు పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు చెట్లను ట్రిమ్మింగ్ చేయడం, గోడలకు పెయింటింగ్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చూడాలని, రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు వ్యర్థాలను డస్ట్‌బిన్లలో వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, పర్యవేక్షక ఇంజనీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఒక రోజు డ్రై డే పాటించండి



సింహాలదేవిడి వద్ద డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం: దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆశ వర్కర్లు సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా 33వ వార్డు సింహాలదేవిడి, కుమ్మర వీధి తదితర ప్రాంతాల్లో ఆశ వర్కర్లు బి.లీలావతి, పి.పార్వతి ఇతర సిబ్బంది ఇంటింటికీ తిరిగి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

వారంలో ఒక రోజు డ్రై డే పాటించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకులను ఖాళీ చేసి ఆరనివ్వాలని, మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వాడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఇంట్లో ఉంచరాదని, దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. నీరు నిల్వ ఉన్న గుంతల్లో క్రిమిసంహారక మందులు, కిరోసిన్, వాడిన ఇంజిన్ ఆయిల్ వంటివి గుడ్డలో ముంచి ఆ గుంతల్లో వేస్తే దోమ లార్వాలు చనిపోతాయన్నారు. మురుగునీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా పెట్టాలన్నారు. కిటికీలు, తలుపులకు జాలీలు బిగించి, వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలని తెలిపారు. శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలని సూచించారు.

పోషకాహార లోపం గల పిల్లల గుర్తింపు



సర్వేలో భాగంగా డేటా సేకరిస్తున్న ఆశ కార్యకర్త పార్వతి, సెక్రటరీలు చిరంజీవి, శ్రావ్య

అల్లిపురం: ఆరోగ్యమైన చిన్నారులు, కౌమార దశ బాలికలు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు, 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, రక్తహీనత ఉన్న కౌమార బాలికలు 10 నుంచి 19 సంవత్సరాలు, 49 సంవత్సరాలలోపు గర్భిణుల డేటాను ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి పోషకాహారం అందించనున్నట్లు సర్వే అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా లబ్ధిదారుల తంబ్ గుర్తింపును డేటా కలెక్షన్ చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి తెలిపారు. ఈ సర్వేలో ఆశ వర్కర్ పి.పార్వతి, వుమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ శ్రావ్య పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు చక్కటి స్పందన



జామియా మసీదు వద్ద ప్రజల నుండి వినతిపత్రాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ సందర్భంగా 39వ వార్డు వాడవీధిలో నివసించే కర్రి ఎర్ని నాగచైతన్య 12 సంవత్సరాల బాలుడు అరుదైన నిమాన్‌పిక్ వ్యాధి వల్ల అపస్మారక స్థితికి చేరుకుని ఇబ్బంది పడుతున్నాడని ఎమ్మెల్యే దృష్టికి రావటంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి ఉచితంగా వైద్యం అందించాలని కోరారు. బాలుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, కాసారపు వాసు, దశమంతుల చిన్ని, సురేష్, మత్స్యకార నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణోత్సవం రేపు



కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట: లోక కల్యాణార్థం ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ ద్రవిడ సంక్షేమ సంఘం శ్రీలలితా నూకాల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు యు.ప్రభాకర్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అన్నమాచార్య సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార త్రిమూర్తికా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి కోలాటం, నృత్యాలతో తిరువీధి మహోత్సవం కల్యాణ మండపం వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు వైఖానస ఆగమ సంప్రదాయంలో పాణంగిపల్లి రంగనాథాచార్య స్వామి బృందంచే శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తి గీతాలాపన, నవ చైతన్య కళానాట్య మండలి సభ్యులచే శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులకు శేషవస్త్రాలు, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్, ఎమ్మెస్ మాధవ్, మేడా మస్తాన్‌రెడ్డి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎన్.స్వామి తదితరులు పాల్గొన్నారు.